



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

అదే స్థి(గ)తి...

- వసతులుండవు..లబ్ధిదారులు వెళ్లలేరు
- నివాసానికీ అననుకూల వాతావరణం
- నిరుపయోగంగా టిడ్కో గృహాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా వాటి పరిస్థితి మారడం లేదు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అననుకూల వాతావరణం ఉండడంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాలు కూడా ఆర్భాటంగా నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు సోమవారం ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి. ఇలా టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు.



కర్నూలు నగర శివారులోని టిడ్కో గృహాలు

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

పెంచికలపాడు చెరువును కాపాడండి

- కలెక్టర్, ఆర్‌డిఒ స్పందించాలి - సమస్య పట్టని విఆర్‌ఒను సస్పెండ్ చేయాలి
- చెరువును సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలం పెంచికలపాడు, కె.నాగలాపురం గ్రామాల మధ్య ఉన్న చెరువు ఆక్రమణకు గురైందని, చెరువును కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ ప్రజలకు సూచించారు. శుక్రవారం వారు చెరువును సందర్శించి ఆర్‌డిఒ, తహశీల్దార్‌తో, గ్రామస్తులతో మాట్లాడారు. కలెక్టర్, ఆర్‌డిఒ వెంటనే స్పందించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్న విఆర్‌ఒపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కె.నాగలాపురం, పెంచికల పాడు గ్రామాల మధ్య ఉన్న చెరువు అనేక సంవత్సరాలుగా సాగునీరు, తాగునీరుకు ఉపయోగకరంగా ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురిస్తే ఆ చెరువు నిండితే రెండు గ్రామాల ప్రజలు వరి నార్లు వేసుకొని వరి పంటలు పండించేవారన్నారు. రెండు గ్రామాల్లో తాగునీరు బోర్లు వేస్తే ఉప్పు నీళ్ళు రావడంతో చెరువు నీటిని తాగునీళ్లగా ఉపయోగించుకునేవారన్నారు. ఆరు మాసాల తర్వాత చెరువుల నీళ్లు తగ్గిన తర్వాత అదే గ్రామానికి చెందిన పేదలు జొన్న కొర్రలు లాంటి పంటలు వేసుకొని జీవించేవారు. అలాంటి చెరువులు భూమి మాది అంటూ నాగలాపురం పెంచికలపాడుకు చెందిన కొందరు గాలి మరల ఫ్యాన్ల కంపెనీ వారికి లీజుకి ఇస్తున్నామని చెప్పి చెరువు కట్ట తెంచారన్నారు. చెరువు మొత్తం ఎర్రమట్టి, గ్రావెల్‌తో చదును చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా గ్రామ విఆర్‌ఒ కృష్ణారెడ్డి, మండల తహశీల్దార్ శివశంకర్ నాయక్ ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారని అన్నారు. విఆర్‌ఓకు ఫోన్ చేసి పని ప్రదేశానికి రావాలని తెలపడంతో నేను పని మీద ఉన్నానని అబద్ధాలు చెప్పి, ఆర్‌డిఒకు సమాచారం ఇచ్చిన తర్వాత అక్కడికి వచ్చారన్నారు. చెరువు కట్టను తెంచడానికి అనుమతులు ఏమైనా ఉన్నాయా, అని అడిగితే కంపెనీ వాళ్ళ దగ్గర ఉన్నాయంట నాకు వాట్స్ అప్ ద్వారా పెడతామన్నారు. కానీ ఇంకా పెట్టలేదని అబద్ధాలు చెప్పారన్నారు. గ్రామ ప్రజలతో గట్టిగా నిలదీస్తే అక్కడ పని చేస్తున్న టిప్పర్లను జెసిబిలను వెనక్కి పంపించారన్నారు. తహశీల్దార్ శివ శంకర్ నాయక్ ఫోన్ చేస్తే అక్కడ చెరువు ఉన్నట్టు పని జరుగుతున్నట్టు తెలియదని అన్నారన్నారు. శిఖామణి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చెరువు కట్ట తెగిపోతే దగ్గరుండి మరమ్మతులు చేయించాడని, గ్రామ ప్రజలు చెప్పారన్నారు. రెవెన్యూ వారికి మాత్రం అది చెరువులో కాకుండా ప్రైవేటు వ్యక్తుల భూమిలా కనిపిస్తుందని, ఎంతకు అమ్ముడు పోయారని గ్రామ ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. వర్షాలు తీవ్రంగా వస్తే కట్ట తెంచడం వల్ల గ్రామం మొత్తం నీట మునుగుతుందని అందుకే కట్టను యధావిధిగా నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. పనులు ఆపాలని కట్టను మళ్ళీ నిర్మాణం చేపట్టాలని నిరసన తెలిపారు. అక్కడ పనిచేస్తున్న జెసిబిలు టిప్పర్లను వెనక్కి పంపించారు. ఇప్పటికైనా గ్రామం నీటిలో కొట్టుకుపోకుండా ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ , ఆర్‌డిఒ జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూడూరు పార్టీ మండల కార్యదర్శి జె. మోహన్, గ్రామ కార్యకర్తలు ఓంకారం, ఆర్.ఎర్రమల, రవి, అయ్యన్న, దేవరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

దోమకాటు పట్ల అప్రమత్తత అవసరం

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పగటి పూట దోమ కాటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచి నీటిని నిల్వ ఉంచుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని సూచించారు. మంచి నీటిలో పెరిగే దోమల వల్లే డెంగ్యూ వస్తోందని, ముఖ్యంగా అర్బన్ ఏరియాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఇంటి లోపల కానీ, ఇంటి బయట కానీ మంచి నీటి నిల్వలకు సంబంధించి తగిన జాగ్రతలు పాటించాలన్నారు. నిల్వ ఉంచుకున్న మంచి నీటి నిల్వలపై మూతలు మూసి ఉంచేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే - డ్రైడే' ను పాటించి దోమల నివారణకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి స్పెషల్ అధికారులు పర్యటనలకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో, డిఆర్‌ఒ ఎస్‌వి. నాగేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ రామగిడ్డయ్య, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

ఉద్యోగుల సమస్యలకు సంబంధించి వచ్చిన ప్రతి ఒక్క అర్జీని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఉద్యోగుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీల తరహాలోనే ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని రిజిస్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఔట్ సోర్సింగ్,కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం లేనందున వారి అర్జీలను రిజిస్టర్‌లో నమోదు చేసి పంపాలని డిఆర్‌కు సూచించారు. వచ్చిన అర్జీలకు సంబంధించి ఒక గ్రీవెన్స్ రిజిస్టర్ నిర్వహిస్తూ, ఏ శాఖకు ఎన్ని గ్రీవెన్స్ లు పంపించడం జరిగిందన్న విషయాలను కూడా అందులో నమోదు చేయాలన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, పరిష్కారానికి వీలులేని అర్జీలకు ఏ కారణంతో పరిష్కరించలేకపోయామో తెలుపుతూ ఎండార్స్‌మెంటును అర్జీదారునికి కచ్చితంగా అందజేయాలన్నారు. స్పందనలో ఎక్కువగా రెవెన్యూ, వైద్యం, విద్య, సాంఘిక సంక్షేమ శాఖల నుండి ఉద్యోగులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వి.నాగేశ్వరరావు, జిల్లాఅధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు వింటున్న కలెక్టర్ డాక్టర్ సృజన



బాధితులను పరామర్శిస్తున్న ఆర్‌డిఒ

దళిత మహిళను పరామర్శించిన ఆర్‌డిఒ

- అన్ని విధాల ఆదుకుంటామని హామీ

ప్రజాశక్తి తుగ్గలి

తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామంలో అత్యాచారానికి గురైన దళిత మహిళను పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాస్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మోహన్‌దాస్ మాట్లాడుతూ దళిత మహిళకు ప్రభుత్వం నుండి రావలసిన అన్నింటిని వచ్చే విధంగా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే దళిత మహిళపై జరిగిన అత్యాచార సంఘటనపై జిల్లా కలెక్టరుకు నివేదిక పంపించామన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎంఆర్‌పి రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేష్ దళిత మహిళకు ప్రభుత్వం నష్టపరహారాన్ని వెంటనే అందించాలని ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేశు,జిల్లాకో కన్వీనర్ పులికొండ, ఎంఆర్‌పిఎస్ నాయకులు జగన్నాథం, తిక్కయ్య, సుధాకర్, రంగస్వామి పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాల మంజూరు చేయాలి

- ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు అధికారులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మన జిల్లాలో సీడ్ ప్రాసెసింగ్ బాగా జరిగేలా వ్యవసాయ శాఖ వారు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే జె సుధాకర్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్ళినప్పుడు మత్స్యకారులు వ్యాపార నిమిత్తం ద్విచక్ర వాహనాలు కావాలని, చేపల వలలు కావాలని, చేపల బుట్టలు కావాలని కోరుతున్నారన్నారు. కోడుమూరు ప్రాంతంలోని మత్స్యకారులకు ఈ అవకాశం కల్పించాలని మత్స్యశాఖ జెడి శ్యామలకు సూచించారు. జెడి మాట్లాడుతూ గతంలో ఇచ్చామని మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెస్తామన్నారు. సమావేశంలో ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, మత్స్య శాఖ అధికారి శ్యామల, ఎస్‌సి కార్పొరేషన్, మార్కెటింగ్, ఉద్యాన, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తాం: ఎఇఒ

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలను తనిఖీలు చేస్తామని ఎంఇఒలు మస్తాన్‌వలి, రమేష్ తెలిపారు ప్రైవేట్ పాఠశాలలో నిలువు దోపిడీ అనే శీర్షికను ప్రజాశక్తి లో వచ్చిన వార్తకు స్పందిస్తూ ప్రవేట్ పాఠశాలలో అధిక ఫీజులు భారంపై విచారణ చేస్తామన్నారు పాఠశాలలో నిబంధనలను ప్రకారమే నడిపిస్తామని లేదా పరిశీలిస్తామన్నారు. నిబంధనలు విరుద్ధంగా నడిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పత్తికొండ

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వినోద్ ,అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఇఒ మస్తాన్వలి , ఎంఇఒ-2 రమేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పత్తికొండ పట్టణంలో యశోద గార్డెన్ స్కూల్ ప్రైవేట్ పాఠశాల అయినప్పటికీ కార్పొరేట్ ఫీజులు వసూలు చేస్తున్నారని, రికార్డుల ప్రకారం యశోద గార్డెన్ స్కూల్‌గా కొనసాగుతున్నా మార్కెట్లో మాత్రం శ్రీ చైతన్య విద్యాసంస్థగా చలామణి అవుతుందన్నారు. పట్టణంలోని కొన్ని పాఠశాలలో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నా సరయిన ఉపాధ్యాయులు లేరన్నారు పాఠశాలలో గ్రౌండ్ సౌకర్యం, పిల్లలు మరుగుదొడ్లకు వెళ్లేందుకు అవకాశం లేని పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యాధికారులు స్పందించి పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలను విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

శ్రీ చైతన్యలో మాక్ ఎన్నికల నిర్వహణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


కర్నూలు వెంకటరమణ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం మాక్ జనరల్ ఎలక్షన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల ఎజిఎం సురేష్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన పతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. మంచి దేశ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్ఐ రామాంజనేయులు,అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ మంజుల, ఎఒ పరమేశ్వర్ రెడ్డి, డి.రాజేష్, ప్రైమరీ ఇన్చార్జులు రోజా, సుజాత, రాణి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ జెఎసి వేతన ఒప్పందంతో ప్రయోజనం లేదు

మరోపోరాటానికి సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి-గూడూరు

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం చేసిన యాజమాన్య నిర్ణయాన్ని , జెఎసి వేతన ఒప్పందాన్ని వ్యతిరేకించండని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు అన్నారు. శుక్రవారం గూడూరు లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను, ఆపరేటర్లతో అంజిబాబు, మండల కార్యదర్శి కె.మోహన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అంజిబాబు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల, అధికారులకు తెలపకుండా చీకటి ఒప్పందం చేసుకొన్నాయని, ఈ ఒప్పందాన్ని ఉద్యోగ కార్మికులు అంగీకరించడం లేదని అన్నారు. ఈనెల9న రాష్ట్ర మంత్రులు ఉన్నతాధికారులతో, విద్యుత్ జెఎసి నాయకత్వం చేసిన విద్యుత్ వేతన ఒప్పందాన్ని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్, స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఇంజనీర్లు, కాంట్రాక్టు కార్మికులంతా ఒక వేదిక పైకి వచ్చి న్యాయమైన వేతన ఒప్పందాన్ని సాధించడానికి అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఇంజనీర్ కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలని గత 17 నెలలుగా పవర్ జెఎసి చర్చలను సాగదీసిందని, ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదన్నారు. ఈ నేపథ్యంలో స్ట్రగుల్ కమిటీ ఏర్పడి పోరాటానికి సిద్ధపడిందని, ఆగస్టు 10న నిరవధిక సమ్మెకు పోరాట కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఆగస్టు 9న అర్ధాంతరంగా ఉద్యమాన్ని విరమించిందన్నారు. ఆగస్టు 8 చలో విద్యుత్ సౌధకు పోలీసుల అనుమతి లేదని, ఉపసంహరించుకుందని, పవర్ జెఎసికి కాంట్రాక్ట్ కార్మికులపై ఒప్పందం చేసే అధికారం లేదన్నారు. తెలంగాణలో కాంట్రాక్ట్ కార్మికులకు ఆర్టిజన్స్ పేరుతో నేరుగా నెలకు రూ.40 వేల జీతం అందుతుందని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు పెరిగిన జీతంతో కలిపినా నెలకు రూ.21 వేలు మాత్రమే వస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను బడా కార్పొరేట్లకు రూ.వేల కోట్లకు ముట్ట చెబుతున్న యాజమాన్యం నష్టాలసాకుతో కార్మికులకు వేతన ఒప్పందంలో అన్యాయం చేస్తున్నాయని, అందుకే విద్యుత్ ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన విద్యుత్ ఉద్యోగులను , కాంట్రాక్ట్ కార్మికులను కోరారు. కార్యక్రమంలో కాంటాక్ట్ కార్మికులు చంద్రశేఖర్, ఈరన్న, మహేష్, రఫీ, చిన్న సురేష్, నడిపి సురేష్, పాల్గొన్నారు.



గూడూరులో విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను విడుదల చేస్తున్న నాయకులు

విజయం కోసం కలిసికట్టుగా పని చేద్దాం : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి విజయం కోసం కలిసికట్టుగా పని చేద్దామని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ .హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరం ఖండేరిలోని రాయల్ ఫంక్షన్ హాల్ లో జెసిఎస్, వైసిపి వార్డు కన్వీనర్ల శిబిరాన్ని ఆయన కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసిపి ప్రజలకు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక టిడిపి, జనసేన విష ప్రచారం చేస్తున్నాయన్నారు. సీఎం చేస్తున్న కృషిని ప్రజల వద్దకు చేర్చే బాధ్యత పార్టీ జెసిఎస్ కన్వీనర్లపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పోరాడే యోధులు కన్వీనర్లు కార్యకర్తలేనన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలన్నారు. రాష్ట్రంలో వాలంటీర్ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చుతున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. పేదల విద్య కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ తో పాటు 15 వందలు పిహెచ్‌సిలను బలోపేతం చేయడమే కాకుండా 17 నూతన మెడికల్ కళాశాలలను మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం తమదన్నారు. చంద్రబాబు హయాంలో 7200 కిలోమీటర్లు రోడ్లు వేస్తే ప్రస్తుతం 11500 కిలోమీటర్ల రోడ్లు వేసిన వైసిపి విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. చంద్రబాబు హయాంలో లాగా ఉన్న అప్పులను తమ ప్రభుత్వం హయాంలో 58 శాతానికి తగ్గించామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం రూ.నాలుగు లక్షల కోట్లతో రెండున్నర కోట్ల మందికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర జాబితాలో ఏపీ మొదటి స్థానంలోఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. వైసిపి నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ , వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, రైల్వే ప్రసాద్ షాషావలి, ఖాదర్ బాషా, ఫరాజ్ ఖాన్ యూనస్ షేక్ అహ్మద్ కో ఆప్షన్ మెంబర్లు శ్రీరాములు,మేరీ, మార్కెట్ యార్డు డైరెక్టర్ విజయలక్ష్మి , వైసిపి నాయకులు ఆది మోహన్ రెడ్డి, కేదార్నాథ్ , సూర్యుడు, వార్డు ఇన్చార్జులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్



మహిళా కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పి.నిర్మల

మహిళా కార్మికుల హక్కుల కోసం పోరాటం


శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్

మహిళా కార్మికులు హక్కుల కోసం, మౌలిక సదుపాయాల కోసం పోరాట బాట పట్టాలని శ్రామిక మహిళా సంఘం కర్నూలు జిల్లా కన్వీనర్ పి.నిర్మల కోరారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మహిళా కార్మికుల విస్తృత సమావేశం మేస్త్రి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పి.నిర్మల మాట్లాడుతూ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న మహిళా కార్మికులకు ఎలాంటి రక్షణ చట్టాలు లేవని,వారికి లైసెన్సులు, గుర్తింపు కార్డులు లేవన్నారు. దుమ్ముకు దూలికి రోజు పనిచేస్తూ అనారోగ్యాల పాలై చనిపోతున్నా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాదిమంది పనిచేస్తున్న మహిళలకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం, మంచినీటి సౌకర్యం లేకపోవడం చూస్తుంటే మార్కెట్ యార్డ్ పాలకమండలి మహిళల పట్ల ఎలాంటి వివక్ష చూపుతుందో అర్థం అవుతుందన్నారు. అందుకే మహిళా కార్మికులు హక్కుల కోసం మౌలిక సదుపాయాల కోసం పోరాట బాట పట్టాలని కోరారు. మార్కెట్ యార్డు యూనియన్ల గౌరవ అధ్యక్షుడు టి.రాముడు. సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ నరసింహులు, సిహెచ్.సాయి బాబా లు మాట్లాడుతూ మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నారాయణమ్మ కన్వీనర్‌గా పదిమంది మహిళాకార్మికులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పై డిమాండ్లు ను పరిష్కరించాలని మార్కెట్ యార్డు సెక్రెటరీ గోవిందుకు సిఐటియు నాయకులు నూతన కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. సిఐటియు కోత హమాలి యూనియన్ నాయకులు వెంకటస్వామి, వలి, వెంకటేశ్వర్లు, త్యాగరాజు దస్తగిరి పాల్గొన్నారు.

టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం : గౌరుచరిత


ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



వైసిపి పాలనలో రాష్ట్ర అధోగతి పాలయిందని టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి పాణ్యం ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిఅన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 36వ వార్డ్ బళ్ళారి చౌరస్తా, యమహా షోరూం, గీత నగర్‌లో టిడిపి మాహాశక్తి, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి గౌరుచరిత ప్రజలకు పథకాల గురించి వివరిస్తూ ఒక్క ఛాన్స్ ఇవ్వండని అబద్దాలతో రాష్ట్ర ప్రజలను నమ్మించిన సీఎం జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్



ధ్రువపత్రాలను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - హోళగుంద

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని హెబ్బటం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. మహిళలకు రూ.20 లక్షలతో సామూహిక మురుగుదొడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిసి రోడ్లు, డ్రెయినేజీ కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపిపి తనయుడు ఈషా, వైసిపి నాయకులు అయ్యాలప్ప, ఎంపిటిసి ఉరుకుందప్ప, గుబ్బలి లక్ష్మయ్య, పాల్గొన్నారు.

వైసిపికి పాడే కట్టేందుకు ప్రజలు సిద్ధం

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

నాలుగేళ్లలో రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టిన వైసిపి ప్రభుత్వానికి పాడే కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాలు, సిద్ధేశ్వర కాలనీలో 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను అందజేసి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైసిపి నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూ విద్యుత్, బస్సు, పెట్రోల్, డీజిల్ చార్జీలు పెంచారని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల రక్తం పీల్చుతున్న సైకో ప్రభుత్వానికి పాడే కట్టి కాటికి పంపాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని, మేనిఫెస్టోతో ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ ప్రజల చెంతకు వస్తున్నట్లు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ అశోక్, నాయకులు నరసప్ప, నారాయణ, భాస్కర్, నాగరాజు, చంద్రశేఖర్, కిశోర్, గూళ్యం రామాంజనేయులు, మసాల జగన్ పాల్గొన్నారు.

మళ్లీ జగనే సిఎం : ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

వచ్చే 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని చిన్న తుంబలం గ్రామంలో రెండోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డిని, వైసిపి నాయకులు పురుషోత్తం రెడ్డిని, రామ్మోహన్ రెడ్డిని ఎంపిటిసి బడెమ్మ లక్ష్మన్న ఆధ్వర్యంలో వైసిపి నాయకులు రవీంద్ర, తెలుగు చిన్న వీరేష్, కడుగూరు మహాదేవప్ప, యోహాను ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదీప్ రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యల గురించి, ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

గోప్యంగా దుకాణాల కేటాయింపు

- కోర్టును ఆశ్రయిస్తామంటున్న బాధితులు

ప్రజాశక్తి - ఆదోని



కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని దుకాణదారులు పేర్కొంటున్నారు. మున్సిపల్ రోడ్లలోని 42 దుకాణాల వరకు అద్దె కోసం ఈనెల 10న వేలం నిర్వహించారు. బహిరంగ వేలమని ప్రకటన జారీ చేసినా దుకాణదారులకే అనుకూలంగా దుకాణ గదులు కేటాయింపు జరిగిందని విమర్శలు వస్తున్నాయి. అద్దె పెంపుపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని మున్సిపల్ అధికారులు దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. అత్యంత తక్కువ ఉన్న అద్దెను అధికారులు రూ.13 వేల వరకు నిర్ణయించి ఈనెల 10న మున్సిపల్ కార్యాలయంలో వారికే దుకాణాలు అప్పగించారు. బహిరంగ వేలమని ప్రకటించి గోప్యంగా దుకాణాల కేటాయింపు ఏమిటని పలువురు నిలదీస్తున్నారు. అందులో అక్రమాలు జరిగి ఉండవచ్చని, దీనిపై మరో దఫా కోర్టుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని వివరణ కోరగా... దుకాణదారులకు వేలం నిర్వహించామని, ఎవరూ పాల్గొనకపోవడంతో పాత వారికే కేటాయించామని వివరించారు. గతంలో నామమాత్రంగా ఉన్న అద్దెను రూ.13 వేలకు పెంచి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చామన్నారు. ఇందులో ఎలాంటి అపోహలూ వద్దని, పూర్తి సమాచారం తమ వద్ద ఉందని స్పష్టం చేశారు.

కోర్టును ఆశ్రయిస్తాం

- మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకులు రామచంద్ర



మున్సిపల్ దుకాణ కేటాయింపులు బహిరంగంగా వేలం నిర్వహిస్తే పోటీ ఏర్పడి ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉండేది. పాత వారికే కేటాయించి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టారు. దీనిపై కోర్టును ఆశ్రయించి మున్సిపల్ అధికారులకు నోటీసులు పంపిస్తాం. అధికారుల నిర్వాకం వల్ల అసలైన వారికి అన్యాయం జరిగింది.

మున్సిపల్ ఆదాయానికి గండి

- మాజీ కౌన్సిలర్, సిపిఎం నాయకులు ఈరన్న

మున్సిపల్ దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరగలేదని తెలిసింది. బహిరంగంగా వేలం నిర్వహించి ఉంటే పోటీ జరిగి అద్దె మరింత పెరిగే అవకాశం ఉండేది. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల లక్షలాది రూపాయల ఆదాయం తగ్గింది. వారే అనుకూలంగా కమిటీ ఏర్పడి పాతవారికి నామ మాత్రంగా అద్దెను ప్రకటించడం సమంజసం కాదు. వ్యాపార పరంగా డిమాండ్ ఉన్న ఏరియాలో ఇంత తక్కువ అద్దెకు ఎలా ఇస్తారని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించాలి. లేకపోతే ఆందోళన నిర్వహిస్తాం.



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యల పరిష్కారమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోనిహనుమాన్ నగర్‌లో రెండో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, కౌన్సిలర్ లోకేశ్వర్ అధ్యక్షతన వార్డు ఇన్‌ఛార్జి నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి వార్డులో ప్రతి గడపకూ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనేకమంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. హామీలను నెరవేర్చారని, తమకు అన్ని పనులు జరిగాయని పేర్కొంటూ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతూ ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పాలని వాటిని కూడా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతో పాటు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో ప్రజలు జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదిస్తారని చెప్పారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మణి అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, చంద్రకాంత్ రెడ్డి, డైరెక్టర్ రేణుక, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, సురేష్, వార్డు ఇన్‌ఛార్జి నాగరాజ్, కౌన్సిలర్ లోకేశ్వర్, సునార్ భాదర్, రామలింగేశ్వర, మాధవరెడ్డి, వీకె.లక్ష్మన్న, శీనా, చిన్న ఈరన్న, మహిళలు జులేఖ, శ్రీలక్ష్మి, శ్రీదేవి, శంకర్, హరి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

పూలే, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పొనకలదిన్నె గ్రామంలో మహాత్మ జ్యోతి రావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామ దళిత సంఘాల కమిటీ నాయకులు ప్రేమర లక్ష్మన్న, పేతూరు ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దగ్గర భూమి పూజ చేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకవీడు రాజు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, సర్పంచి గొల్ల పావని, ఎంపిటిసి జైపాల్ రెడ్డి, వైసిపి నాయకులు గొల్ల నాగరాజు, రామచంద్రారెడ్డి, గొల్ల వెంకటేష్, గొల్ల మేకల ఈరన్న, నారాయణ హాజరయ్యారు. ముందుగా నాయకులు పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. పూలే, అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పేందుకు గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం నియోజకవర్గంలో మొదటిసారి అని తెలిపారు. మహనీయుల స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాలు ఐక్యంగా ఉండి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సర్పంచి పావని మాట్లాడుతూ... ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి సహకారంతోనే అన్ని కుల, మతాలకు అతీతంగా పూలే, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని తెలిపారు. గ్రామ దళితులు దావీదు, బతుకన్న, పెద్దయ్య వార్డు మెంబర్ మాల రంగన్న, మాజీ ఎంపిటిసి మాల హనుమంతు, మాల బజారి, ఆంధ్రప్రదేశ్ వృత్తి ధర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపిఎస్ నాయకులు కలుగొట్ల మాల రాజా రమేష్, గుంటెప్ప, కనకవీడు మాల నాగప్ప, దైవందిన్నె ఎర్రన్న పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచి పావని

బాధితులకు మాల మహానాడు పరామర్శ


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య శుక్రవారం పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టిఎస్.కుల్లూరు మాల మల్లకల్లును, అలాగే పార్లపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో గాయపడిన అత్త, కోడలును పరామర్శించారు. వారికి వైద్యం చేయించారు. అలాగే ధైర్యం చెప్పి చిన్న, చిన్న విషయాలకు సహనం కోల్పోవద్దని తెలిపారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. మల్లేష్, పరమేష్, నరసింహా, లక్ష్మణ్, పెద్దయ్య, రాజోలప్ప, నాగప్ప పాల్గొన్నారు.

ఆస్పత్రి ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలులోని గౌరీ గోపాల్ ఆస్పత్రిలో గుండె జబ్బుతో చికిత్స పొందుతున్న కమ్మరి అన్నయ్యకు వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు ఆస్పత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సలహా సంఘం మండల కోశాధికారిగా కుమ్మరి అన్నయ్య పని చేస్తున్నారు. గుండె జబ్బుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల తరపున భీమిరెడ్డి ఆస్పత్రికి చేరుకుని రూ.15 వేల ఆర్థిక సహాయం అందించి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసిపి కల్లుదేవకుంట నాయకులు సుంకన్న, బసాపురం వార్డు సభ్యులు బడేసాబ్ ఉన్నారు.



వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని, అభివృద్ధి చేయడంలో వైసిపి విఫలమైందని టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. శుక్రవారం కౌతాళం మండలం ఏరిగేరి నుంచి కామవరం రోడ్డులో పాలకుర్తి తిక్కారెడ్డి సెల్ఫీ చాలెంజ్ విసిరారు. రోడ్డు అధ్వాన స్థితిలో ఉందని తెలిపారు.

రాజగోపురం, అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం/మంత్రాలయం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి, అన్నదానానికి కలుదేవకుంట వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు కె.రఘునాథ్ రెడ్డి, వైసిపి యువ నాయకులు విఖ్యాత్ రెడ్డి రూ.2,03,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం స్వామివారి దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు దేవస్థాన రాజగోపుర నిర్మాణానికి రూ.1,01,116, శాశ్వత అన్నదానం పథకానికి రూ.1,02,000 అందజేశారు. కలుదేవకుంట గ్రామానికి చెందిన కె.రఘునాథ్ రెడ్డి ఆయన కుమారుడు, వైసిపి యువ నాయకులు విఖ్యాత్ రెడ్డి, ఆయన భార్య మంత్రాలయం మండల ఉపాధ్యక్షులు సింధూ ప్రియా రెడ్డి, తల్లిదండ్రులతో కలిసి విరాళం అదజేశారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు పూజన్న స్వామి, ఉమేష్ స్వామి, దేవస్థాన సిబ్బంది ఉమేష్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎఒ

దేవనకొండ : ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసుకున్న పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఎఒ సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం పి.కోటకొండ గ్రామ శివారులో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంట నమోదు చేయించుకోకపోతే పంటల బీమా, బ్యాంకు రుణాలు పొందడంలో అనర్హులవుతారని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర పొందాలంటే నమోదు తప్పనిసరి అన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది లింగేశ్వరయ్య, రెడ్డి భీమన్న పాల్గొన్నారు.

ప్రజాశక్తి

శనివారం 19 ఆగస్టు 2023 5

నంద్యాల



స్థి(గ)తి మారదు



అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

- టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువు- నివాసానికి అనానుకూల వాతావరణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేప్పట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టింది. నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు.

వాస్తవాల పత్రిక ప్రజాశక్తి

43వ వార్షికోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి-నంద్యాల రూరల్

నిజాతను నిర్భయంగా వాస్తవాలు ప్రచురించే పత్రిక ప్రజాశక్తి అని 43వ వార్షికోత్సవ సభలో వక్తలు అన్నారు. శుక్రవారం నంద్యాల రామకృష్ణారెడ్డి డిగ్రి కళాశాల ఆడిటోరియంలో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌చార్జి పానుగంటి చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా మాట్లాడుతూ ప్రజాశక్తి నిజాయితీగా నిక్కచ్చిగా, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజల సమస్యలను వెలికి తీస్తుందన్నారు. 43 సంవత్సరాల నుండి కార్మిక, కర్షక,బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజల అధరాబి. మానాలు పొందుతూ ముందుకు సాగుతున్న ప్రజాశక్తి దినపత్రికను అభినందించారు. ప్రజల సమస్యలను, ప్రభుత్వం అందించే ప్రజా సంక్షేమాల పథకాలను, వాటిలోని తప్పులను ఎత్తి చూపిస్తూ పాలకుల దృష్టికి తీసుకువస్తే సరిచేసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు చేసే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు.

నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మాట్లాడుతూ ప్రజాశక్తి పేపరును చాలా కాలం నుండి చదువుతున్నానని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహానుభావులు ఈపత్రిక నిర్వహణకు ప్రారంభంలో సహకరించా రన్నారు. ప్రజల పక్షాన కార్మిక కర్షకుల ఉద్యోగుల కొరకు అట్టడుగు వర్గాల పక్షాన పని చేసే పత్రిక ప్రజాశక్తి అన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసే పత్రికగా ప్రత్యేక భూమిక పోషిస్తుందని అన్నారు.

ప్రజల సమస్యలవెలికి తీసి పాకుల దృష్టికి తేవడంలో ప్రజాశక్తి దినపత్రి ముందుందని సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ అన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత విజయవాడలో ప్రజాశక్తి రాష్ట్ర కార్యాల యాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభిం చారన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను వెలికి తీసి నిజాలు నిర్భయంగా రాసే పత్రిక అని చెప్పారు. పత్రిక ఎంచుకున్న ఆశయానికి కట్టుబడి అంకితభావంతో ప్రజల పత్రికగా పనిచే స్తుందని అన్నారు. దోపిడీ రహిత సమాజ స్థాపన లక్ష్యంగా ప్రజాశక్తి ముందుకెళుతుందన్నారు. భారత రాజ్యాంగానికి అనుగుణ ంగా నడుచుకొని స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం పరిక్షణకు , అట్టడు గు వర్గాల ప్రయోజనాలకోసం పని చేయాలనే రాజకీయాలు లేక పోవడం దురదుష్టకరమన్నారు. దేశంలో పెద్ద ఎత్తున మత ఘర్షణలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీలపై, క్రిస్టియన్లపై , దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. ఇవన్ని ఒక పథకం ప్రకారం పాలకులు చేస్తున్న దాడులని అభివర్ణిం చారు. కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా సమగ్రా భివృద్ధికోసం పాలకులు కృషి చేయాలని కోరారు.



ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నీసా, అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి. నరసింహా, డాక్టర్ శ్రీకాంత్, తదితరులు

రామకృష్ణారెడ్డి విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాశక్తి దిగ్విజయ ంగా 43 వసంతాలు పూర్తి చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పత్రికా ప్రారంభించడం ఒక ఎత్తు అయితే పత్రికను నడపడం మరొక ఎత్తు అన్నారు. పత్రిక నడపటానికి ఎన్నో వ్యయ ప్రయాసాలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. అందుకు ప్రజల ఆధార అభిమానాలు అవసరమని అన్నారు.

ప్రజాశక్తి పత్రిక ప్రజల పక్షాన వార్తలు రాస్తూ ప్రజలను చైతన్య పరుస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. భవిష్యత్తులో కార్మిక వర్గానికి ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజాశక్తి పత్రిక కావాలని ఆకాంక్షించారు. ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలబడే పత్రికలలో ఒకటి ఇఎన్‌టి స్పెషలిస్టు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈరోజుల్లో ఒక పత్రికను నిరాటంకంగా నడపాల ంటే ఎంతో శక్తిసామర్థ్యాలు ఓర్పు కావాలన్నారు. పెట్టుదారి వ్యవస్థ అన్ని రంగాలను శాసిస్తుందని ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా అన్నారు. ప్రధానంగా ఏ రాష్ట్రానికి ఎవరు ముఖ్యమంత్రి, ఎవరు గవర్నరు కావాలో పెట్టుబడిదారులే శాసిస్తున్నారన్నారు. అన్నిరంగాలపై కార్పొరేట్ శక్తులు ప్రభావం పెరిగిందన్నారు.ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జి చంద్రయ్య మాట్లాడుతూ.. ప్రజాశక్తి ప్రస్థానాన్ని వివరించారు. 1981 నుంచి దినపత్రికగా నిరాటంకంగా కార్మికులు, కర్షకులు, అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగుల ఆదరాభిమా నాలతో కొనసాగుతుం దన్నారు. ప్రజాశక్తి 25వ వార్షికోత్సవానికి అప్పటి ప్రధాన మంత్రి మన్‌మోహన్‌సింగ్ హాజరయ్యారని తెలిపారు. ఇది తెలుగుపత్రికా రంగానికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎం.రాజు, డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున రావు, సర్క్యులేసన్ ఇన్‌చార్జి శివప్ప, విలేకరులు డి.మౌలాలి, మాదాల శ్రీనివాసులు, సోమశేఖర్, సుబ్బారాయుడు, మద్దయ్య, చంద్రశేఖర్, గోపికృష్ణ, నిజాం, మహబూబ్‌బాష, పాఠకులు , ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో కలెక్టర్ ఆకస్మిత తనిఖీ

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లను, నిర్మాణంలో వున్న- పూర్తయిన ఇళ్ళను నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు, హౌసింగ్ ఇఇ, డిఇ ఉమామహేశ్వర రావులతో లబ్ధిదారులకు చేరుతున్న వసతుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. అదేవిధంగా రోడ్లు, విద్యుత్తు లైన్లు, నీటి వసతులపై ఆయా సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో అమను ల్లా, హౌసింగ్ ఏఈ శీను, ఏఇపిఆర్ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ పకీరయ్య, విద్యుత్ శాఖ ఏఇ రవీంద్ర నాయక్, వెలుగోడు పంచాయతీ సెక్రెటరీ హరిలీలా, వెలుగోడు సర్పంచ్ జయపాల్ పాల్గొన్నారు.



జగనన్నా కాలనీ తనిఖీ చేస్తున్న కలెక్టర్

సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మ్యూచువల్ ట్రాన్సర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీ, తదితర వాటి గురించి ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఎస్పి ఆదేశించారు.

ఈ కార్యాక్రమంలో జిల్లా ఎస్పీ అడిషనల్ ఎస్పి అడ్మిన్ జి.వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహిస్తోందని సమస్యలను నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించి వివిధ కార్యాలయాల సిబ్బంది నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కారంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు. ఉద్యోగుల గ్రీవెన్స్ డేలో స్వీకరించిన అర్జీలకు సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలు సంబంధిత పూర్తి సమాచారంతో వచ్చే సమావేశానికి రావాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం.1233లోని ఆదేశాల మేరకు నెలలో ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో వివిధ శాఖల నుంచి 19 మంది ఉద్యోగులు తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించుకున్నారు.




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

భవననిర్మాణ కార్మికుల సమస్యలపై

అసెంబ్లీలో ప్రస్తావించండి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

భవననిర్మాణ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి సిఐటియు నాయకులు వినతి అందజేశారు. శుక్రవారం వారు పట్టణంలోని స్థానిక శాసనసభ సభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి స్వగృహంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల క్లైములు వెంటనే చెల్లించాలి, వారి సమస్యల పైన అసెంబ్లీలో ప్రసాదించాలని వారికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ బిల్డింగ్, అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, నాయకులు ఏ సురేంద్ర సిఐటియు పట్టణ కార్యదర్శి డి రామ్ నాయక్, పట్టణ ఉపాధ్యక్షుడు ఏ. రణధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేస్తూ ఇచ్చిన 1214 మేమో రద్దుచేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని, గత నాలుగేళ్ల నుండి పెండింగ్లో పెట్టిన పథకాల పరిహారాలను కార్మికులకు తక్షణమే చెల్లించాలని, పక్క రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్నట్లు మోటార్ సైకిల్స్, పెన్షన్, సొంత ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4 ఏళ్లుగా అనేకసార్లు వైసీపీ నాయకులకు, కార్మికశాఖ ఉన్నత అధికారులకు వినతులు అందించినా ప్రభుత్వంలో చలనంలేదని, ప్రభుత్వం భవననిర్మాణ కార్మికులకు చేసిన అన్యాయాన్ని ప్రతిఘడించడానికి ప్రతీ కార్మికుడు సిద్ధపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్, అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముస్తఫా, మహమ్మద్, నూర్ అహ్మద్ గణపతి చిన్న వలి,సుభాన్,ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రతి ఇంటికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైల నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. గ్రామంలో వివిధ అనారోగ్య కారణాలవల్ల బాధపడుతున్న నాలుగు కుటుంబాలకు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు శివ శంకర్ రెడ్డి, ఎంపీపీ నల్ల కాల్వ తిరుపాలమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, తహశీల్దార్ ఉమా రాణి, ఎంపీడీవో మోహన్ కుమార్, వ్యవసాయ శాఖ ఏవో విష్ణువర్ధన్ రెడ్డి, ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని రామాపురం గ్రామంలో చిన్న కంబగిరి ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్న కంబగిరి గని కార్మికులుగా జీవిస్తూ జీవనం సాగిస్తున్నారు. వృత్తిలో భాగంగా తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వంట చేసేందుకు గ్యాస్ పోయిని వెలిగించగానే ఒక్కసారిగా సిలిండర్ భారీ శబ్దంతో పేలిం ది. ఇంటిలోనే ఉన్న చిన్న కంబగిరి, భార్య దస్తగిరమ్మ, కూతురు దస్తగిరమ్మకు గాయాలు అయ్యాయి. పేలుడు దాటికి ఇంటి గోడలు కూలిపోయాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయాల పాలైన చిన్న కంబగిరి కుటుంబ సభ్యులు

నేడు కోట కందుకూరు సర్పంచి స్థానానికి పోలింగ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోట కందుకూరు గ్రామ సర్పంచ్ ఎన్నికకు పోలింగ్ శనివారం జరగను ంది. ఇందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఐదుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గ్రామానికి చెందిన 3240 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు అధికారులు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక వాహనంలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయం నుండి కోటకందుకూరుకు తరలించారు.

మండలంలోని ఎస్. లింగందిన్నెలో వార్డు మెంబర్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ

మండలంలోని కోట కందుకూరు గ్రామపంచాయతీ సర్పంచి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తనిఖీ చేశారు. డిపిఒ మాట్లాడుతూ నంద్యాల డివిజన్లో కేవలం సర్పంచ్ స్థానానికి ఈ గ్రామంలోనే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 18 స్థానాల్లో వార్డు మెంబర్లకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో తాసిల్దార్ హరినాథ్ రావు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

పోలీస్ బందోబస్తు ఏర్పాటు..

కోట కందుకూరు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్పి వెంకట రామయ్య ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహులు తెలిపారు. సిఐలు రమేష్ బాబు హనుమంతు నాయక్ తదితరులు ఉన్నారు.



కోట కందుకూరులో డిఎస్పీ, సిఐలు

బాలుర ఉన్నత పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

-కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15న ఇచ్చిన హామీని 36 గంటల్లో మంచినీటి కొరత తీర్చడం, ఉపాధ్యాయుల కోరిక మేరకు ఆట వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేయడంతో కాటసాని ఓబుల్ రెడ్డికి అభినందన సభను ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు యాగంటప్ప అధ్యక్షతన నిర్వహించారు. కాటసాని ఓబుల్ రెడ్డిని, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరిం చుకొని పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులకు సిబ్బందికి భోజన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల మౌలిక వసతులను విద్యార్థులకు, పాఠశాలకు కావలసిన అవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలో 36 గంటల్లోనే మంచినీటి కొరత తీర్చడం, ఉపాధ్యాయుల కోరిక మేరకు ఆట వస్తువులను బహుమతులుగా ఇవ్వడం, విద్యార్థులకు భోజన చేయడానికి కంచాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రెండు లక్షల రూపాయల వరకు పని ప్రారంభించినట్లు తెలిపారు. మంచినీటి సౌకర్యం కొరకు మొత్తం పైప్ లైన్ ఖర్చు అంతా తానే భరిస్తానని గ్రౌండ్ లెవెల్ కొరకు మట్టిని వేయించి చదును చేయడానికి సొంత ఖర్చులతో చేయిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడి వారికి కావాల్సిన సమస్యలన్నింటిని అడిగి తెలుసుకుని పరిష్కార దిశకు ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కాటసాని తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లలను ప్రభుత్వం క్రమమైన పద్ధతిలో ఉన్నత స్థితిలోకి తీసుకురావడానికి అనేక మార్గాలను అన్వేషిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్ అత్తార్ జాహిద్ హుస్సేన్, ఉపాధ్యాయులు బి. మాధవస్వామి ,రాజు నాయక్ ప్రసాద్ రెడ్డి హానీఫ్, లక్షణామూర్తి ,ఖాద్రి, బాల పుల్లయ్య, సుధాకర్ జరీనా బేగం వరలక్ష్మి గౌస్ మొద్దీన్ ఓబులమ్మ వెంకటయ్య సాయి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ యువ నేత కాటసాని ఓబుల్ రెడ్డి

హజ్‌యాత్రకు నారా లోకేష్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

హజ్ యాత్రకు ఓ ముస్లిం పేద మహిళకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సాయం చేశారు. మండలంలోని పేద ముస్లిం మహిళ పంచర్ బంకు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న పార్నపల్లి గ్రామానికి చెందిన హుస్సేన్ బికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మే నెల 17న యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం నగదు పంపించారు. ఈ మేరకు శుక్రవారం టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు టిడిపి ఇన్చార్జ్ బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టిడిపి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా ఆధ్వర్యంలో రూ. 1.50 లక్షల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పార్నపల్లి గ్రామంలో పంచర్ బంకు నడుపుకుంటూ ఒంటరిగా జీవిస్తున్న హుస్సేన్ బిని పలకరించి ఏమి కావాలమ్మా అని అడగగా నా చిరకాల కోరిక హజ్ యాత్ర చేయాలని తెలియజే యడంతో తాను ఏర్పాటు చేస్తానన్న హామీ ఇవ్వడంతో దానికి అయ్యే ఖర్చులు ఫ్లైట్ టికెట్లు పంపించడం జరిగిందన్నారు. జిల్లా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖలీముల్లా మాట్లాడుతూ మైనార్టీ సోదరులు మహిళలు తెలుగుదేశం పార్టీకి అండదండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ పార్టీ నాయకులు శ్రీశైలం ఫస్ట్ బోర్డ్ మెంబర్ చిట్టెంబొట్ల భరద్వాజ శర్మ, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షులు బి మల్లేశ్వర్ రెడ్డి, మాజీ సింగల్ విండోస్ చైర్మన్ కంచర్ల మనోహర్, తెలుగు దేశం పార్టీ బుడగ జంగాల నాయకుడు తాడికొండ బుగ్గ రాముడు, బుల్లెట్ రాఘవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు మురళీధర్ రెడ్డి, నర్ల రాఘవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



పార్నపల్లి హుస్సేన్ బికి నగదును అందిస్తున్న మల్లెల రాజశేఖర్, బుడ్డా రాజశేఖర్ రెడ్డి

23న చలో విజయవాడ : ఎస్‌టియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల 23న ఎస్‌టియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజాం బేగ్, పుల్లయ్యను కోరారు. శుక్రవారం నాడు ఎస్టీయు బేతంచెర్ల ప్రాంతీ య కార్యాలయం నందు ముఖ్య నాయకులు సమావేశం మండల అధ్యక్షులు నాగేశ్వర్ నాయక్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశం నందు జిల్లా ఎస్టీయు అధ్యక్షులు అజాం బేగ్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్న అశాస్త్రీయ విధానాల వలన ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం కావడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన పిఆర్సి, అరియర్స్ , డి ఎ బకాయిలు, జెడ్ పి పి ఎఫ్, ఏపీ జి ఎల్ ఐ. రుణాలు వంటి సమస్యలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి చేపట్టడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకులు ఆది నారా యణ,నాగరాజు,శంకర్ నాయక్, బలరాముడు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరుడు,బలమద్దిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌టియు నేతలు

వెట్టి చాకిరేనా.. వేతనాలు ఎప్పుడు ?

- వేతనాలు చెల్లించకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడతాం : స్వచ్ఛభారత్ కార్మికులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు సరే కానీ ఎప్పుడు ఇస్తారని సిఐటియు నాయకులు రామ్ నాయక్, స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుద్ధ కార్మికుల యూనియన్ నాయకులు మల్లేష్, హనుమంతు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో వేతనాల కోసం సంబంధిత అధికారులను వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పారిశుద్ధ కార్మికులకు వెట్టిచాకిరి ఎక్కువ ఉన్న వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు 14 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, మండల అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగిన వేతనాలు అప్పుడు ఇప్పుడు ఇస్తామని చెప్తున్నారె తప్ప నేటికీ వారి అకౌంట్లో వేతనాలు పడలేదని వాపోయారు. పెండింగ్ వేతనాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఒకపక్క రోజు రోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ ఉంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ స్వచ్ఛభారత్ కార్మికులు నిత్యం పని చేస్తున్నారన్నారు. పెండింగ్ వేతనాలు


ఎంపీడీవో ఆఫీస్ ముందు స్వచ్ఛభారత్ కార్మికులు

ఇవ్వాలని సర్పంచుల చుట్టూ జిల్లా అధికారుల చుట్టూ తిరిగిన ఏమాత్రం ఫలితం లేదన్నారు. వేతనాలు ఇవ్వమని అధికారులను అడుగుతే మీరు పనులు చాలించుకోండి వేరేవాళ్లను పెట్టుకుంటామని నేటికి బెదిరింపులు చేస్తున్నారని తెలిపారు. గత మూడు సంవత్సరాల క్రితం రూ.10వేలు జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 వచ్చినా నేటికీ అమలు కావడం లేదన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అక్రమ వేధింపులు తొలగింపులు ఆపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలలో చెత్త బండ్లు చెడిపోతే వాటి రిపేర్లు ఖర్చులు కూడా ఇవ్వడం లేదని స్వచ్ఛభారత్ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, రెండు జతల చెప్పులు ఇవ్వాలి ప్రభుత్వం వెంటనే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. జిల్లా కలెక్టర్, డిపిఓ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే వారి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వారు కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే రిలే నిరాహార దీక్షలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికులు స్వాములు, వెంకటేశ్వర్లు, రాజారావు, జయన్న, సుబ్బారాయుడు, రవి, రాము, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ ఏడి శ్రీనివాసులరెడ్డి

జీవాల పెంపకంలో మెలకువలను పాటించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

గొర్రెలు, మేకల పెంపకంలో పెంపకం దారులు మెలకువలను పాటిస్తే ఆశించిన ప్రయోజనాలను పొందుతారని పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టరు వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని వెలుగు కార్యాలయంలో చాగలమర్రి,ఉయ్యాలవాడ మండలాలకు చెందిన గొర్రెలు, మేకల పెంపకం దార్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ గొర్రెలు పెంపకం దార్లు శిక్షణలో తెలియజేసే మేలైన యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలన్నారు. అనంతరం ప్యాపిలిలోని గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం మాస్టర్ ట్రైనర్స్ పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసులరెడ్డి,వీఏఎస్‌లు ప్రశాంతి, శ్రీనివాసులు గొర్రెల పెంపకం దార్లకు జీవాల్లో వచ్చే వ్యాధుల గురించి మేలైన యాజమాన్య పద్ధతుల గురించి , గొర్రె, మేక పిల్లల పోషణ, పరాన్న జీవుల వలన వచ్చే వ్యాధుల గురించి శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పశు వైద్యాధికారులు సాయిబాబా,రవి,గొర్రెల పెంపకం దారులు,పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు తెలిపారు.శ సక్రవారం మండలంలోని డి వనిపెంట చెంచుగూడెంలో మలేరియా,దోమల సంబంధిత ఇతర వ్యాధులు రాకుండా గూడెం లోను,ఇళ్ళలో డిడిటిని పిచికారి చేసారు. అనంతరం గ్రామంలోని కాలనీలలో తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటూ చెంచులకు అవగాహన కల్పించారు.కార్యక్రమం లో చెంచు గూడెం స్పెషల్ ఆఫీసర్,పశుసంవర్ధక శాఖ ఏడి వరప్రసాద్,అసిస్టెంట్ డిఎంఓ వరప్రసాద్ రెడ్డి,ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, శేఖర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి పల్లవి,ఏఎన్ఎం సంధ్య,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చెంచుగూడెంలో డిడిటిని పిచికారి చేస్తున్న దృశ్యం

జెసిగా టి. రాహుల్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతన జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నట్లు ఫైల్‌పై సంతకం చేశారు. గతంలో జెసిగా ఇక్కడ విధులు నిర్వహించిన టి. నిశాంతి రెండు నెలల కిందట బదిలీ కావడంతో కలెక్టర్‌కే జెసి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం గత పది రోజుల కిందట శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సబ్ కలెక్టర్‌గా ఉన్న టి. రాహుల్ కుమార్ రెడ్డిని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నంద్యాల జెసిగా బాధ్యతలు తీసుకున్నారు. నంద్యాలకు వచ్చిన జెసికి డిఆర్ఓ పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. పండితులు వేద మంత్రాలతో జేసిని తన ఛాంబర్‌లోకి తీసుకెళ్లి సీట్లో కూర్చోబెట్టారు. అనంతరం జేసి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యల పైన ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే పనుల పురోగతి పైన, చుక్కల భూముల క్రమబద్దీకరణ పైన పోకస్ పెడతామన్నారు.

జెసి నేపథ్యం: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. రాహుల్ కుమార్ రెడ్డి కడప జిల్లా పెండ్లిమర్రి మండలం, నంది మండలం గ్రామంలోని టి. గోవిందరెడ్డి, టి. వసంతలక్ష్మిల రెండో సంతానం టి. రాహుల్ కుమార్ రెడ్డి


జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన జెసి

సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చారు. బీటెక్ చదివి ఆయన సివిల్స్‌లో ర్యాంక్ సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు.

ఈ వత్తికి రావడానికి కలెక్టర్‌లే స్ఫూర్తి

రైతు కుటుంబం నుండి వచ్చిన టి. రాహుల్ కుమార్ రెడ్డి తాను చదువుకునే రోజుల్లో జిల్లాలో కలెక్టర్‌లు చేస్తున్న పనులు సమాజానికి ఏమి చేయాలన్న కలెక్టర్ల ద్వారానే సాధ్యం అవుతుందనే అభిప్రాయంతో సివిల్స్ రాయడం జరిగిందని సమాచారం. 2019లో పరీక్షా రాసి 2020 బ్యాచ్ లో ఎంపిక అయ్యారు. అదే సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లాలో అసి స్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, ఫిషరీష్ గవర్నమెంట్ ఆఫ్ ఇండి యా డిపార్ట్మెంట్ కు అసిస్టెంట్ సెక్రటరీ గాను ఉంటూ అక్టోబర్ 2022 నుండి టెక్కలిలో సబ్


బాధ్యతలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

కలెక్టర్‌గా 10 నెలలు విధులు నిర్వహిం చారు. అదే సమయంలో కలెక్టర్‌గా ఎంపికైన ఆయన 2022లో ట్రైనింగ్ తీసుకున్నారు.

జెసిని కలిసిన అధికారులు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిని రెవిన్యూ, వివిధ జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి పరిచయం చేసూకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెసి రాహుల్ కుమార్ రెడ్డి

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జేసి రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపైన చర్చించిన్నట్లు సమాచారం.


ఆందోళన చేస్తున్న ప్రజలు

సచివాలయం ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు ఒకటవ గ్రామ సచివాలయ పరధిలో డిజిటల్ సహాయకులు లేకపోవడంతో వైఎస్సార్ చేయూత, తదితర పథకాలకు ధృవపత్రాలు అందించడంలో అధికారులు తీవ్ర అలసత్వాన్ని వహిస్తున్నారని గ్రామ ప్రజలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సచివాలయంలో డిజిటల్ సహాయకుడు సెలవులో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఆవేదన వ్యకం చేసారు. ఇన్‌చార్జి బాధ్యతలు వహించేవారు తమకు ఎలాంటి పనులు చేయడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

దళితులపై దాడులను అరికట్టాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి -నందికొట్కూరు టౌన్

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కెవిపిఎస్ జిల్లా నాయకురాలు కే రంగమ్మ డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కు నందు 'దళితులపై ఆగని దాడులు కొనసాగుతున్న అంటరానితనం'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకురాలు కే రంగమ్మ మాట్లాడుతూ మోడీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని అదేవిధంగా మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం బాలికలపై లైంగిక దాడులు, దళితులపై దాడులు 65 శాతం పెరిగాయని, గంటకు నలుగురు స్త్రీలపై లైంగిక దాడులు, 45 నిమిషాలకు ఒక కిడ్నాప్ జరుగుతుందని పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరిగే దాడుల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని అన్నారు. ఇప్పటికైనా మహిళలపై జరుగుతున్న దౌర్జన్యానికి కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు సాజిదాబి, కెవిపిఎస్ నాయకురాలు గంధం హుస్సేనమ్మ, జయరాని, చిన్న ఎల్లమ్మ, రత్నమ్మ, సువర్ణమ్మ లక్ష్మి దేవి, నీలమ్మ, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా నాయకురాలు కే రంగమ్మ

ప్రహరీ గోడ కూల్చివేత దారుణం : సిఐటియు


కూల్చిన ప్రహరీ ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం బస్టాండ్ సమీపంలో ఉన్న 7వ అంగన్‌వాడి సెంటర్ ప్రహరీ గోడను నోటీసులు ఇవ్వకుండా కూల్చడం దారుణం అని సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. శుక్రవారం సిఐటియు, ఎస్ఎఫ్ఐ నేతలు కూల్చిన ప్రహరీ గోడను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు బత్తిని ప్రతాప్, భాస్కర్‌లు మాట్లాడుతూ 17 సంవత్సరాల కిందటనే నిర్మాణం చేపట్టారని, అప్పటి అధికారులు నిర్మాణం చేపట్టడానికి ఎలా అనుమతి ఇచ్చారన్నారు. ఇప్పుడు రహదారికి అడ్డుగా ఉన్నదని కేవలం ఒక వ్యక్తి స్పందనకు అర్జీ పదేపదే ఇస్తున్నారని, నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు విచారణ చేసి గతంలో నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చిన అధికారులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మల్లికార్జున రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, వెంకట మ్మ, మాబున్నిసా, అనిత, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడవ శనివారం సందర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3, గంటల వరకు మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మెయింటెనెన్స్,మరియు 33 కె.వి లైన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో విద్యుత్ ఆధునీకరణ పనులు : ఎఇ

ప్రజాశక్తి- రుద్రవరం



మండలంలోని ఢీకొట్టాల శ్రీరంగాపురం గ్రామాల్లో విద్యుత్ ఆదరణీకరణ పనులు చేపట్టినట్లు ఏఈ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డి కొట్టాల గ్రామంలో అనేక సంవత్సరాల నుంచి విద్యుత్ స్తంభాలకు ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. దీంతో సరఫరాలో అంతరాయం, తీగలు తెగి కింద పడటం లాంటి జరుగుతున్నాయన్నారు. దీంతో గ్రామస్తుల విన్నపం మేరకు కిలోమీటర్ పొడవున కొత్త విద్యుత్ కేబుల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శ్రీరంగాపురం గ్రామంలో 20 కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో రెండు గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం అయిందన్నారు.

కుల, మతాలకు అతీతంగా పెళ్లి కానుక

ప్రజాశక్తి - బనగానపల్లె

కుల, మతాలకు అతీతంగా అందరికీ పెళ్లి కానుకలను పంపిణీ చేస్తున్నట్లు పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దాసరి అలివేలు, వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తెకు, గుండ్రాళ్ల శేషమ్మ, శేఖర్‌ల కుమార్తెకు, పలుకూరుకు చెందిన పున్నం సుబ్బన్న, లక్ష్మిదేవిల కుమార్తెకు, పెద్దరాజుపాలెంకు చెందిన కొండు గుర్రమ్మ, చిన్నభూషన్నల కుమార్తెకు, రామకృష్ణాపురంకు చెందిన చల్లా వెంకటేశ్వర్లు, చల్లా క్రిష్ణవేణిల కుమార్తెకు,అవుకు మండలం మంగంపేటకు చెందిన కొంగని జయలక్ష్మి, శ్రీనివాసుల యాదవ్‌ల కుమార్తెకు పెళ్లి కాను కలు బిసి రాజారెడ్డి పెళ్లి కానుకలను అందజేశారు. ఈసందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కీర్తిశేషులు బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వివాహం చేసుకోబోయే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేయడం జరుగుతుందన్నారు. 2022 నుంచి ఈ పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇప్పటి వరకు 452 మందికి పెళ్లి కానుక అందజేశామని తెలిపారు. కానుకలో పెండ్లి కుమార్తెకు చీర, పెండ్లి కుమారుడికి సర్ట్, పాయింటు ఉంటాయన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నట్లు బిసి రాజారెడ్డి తెలిపారు. వధువు తరపున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే


పెళ్లి కానుకలను అందజేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, అవుకు మండలా ల్లోని ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిసి రాజా రెడ్డి కోరారు.

బ్రాహ్మణ కొట్కూరు సహకార సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారం

- మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్టుకూరు సహకార సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సహకార సొసైటీ సీఈవో అశోక్ కుమార్ సహకార సొసైటీ చైర్మన్‌గా మద్దూర్ సతీష్ కుమార్ రెడ్డి, డైరెక్టర్లుగా ఎస్ గంగాధరప్ప, ఏ.వెంకటనారాయణలతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కృషి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, చిత్రంలో బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

అభినందనీయమని అన్నారు. ముచ్చు మర్రి ఎత్తిపోతల పథకానికి రైతు సంక్షేమం కోసం పాటుపడిన దివంగత నేత మాజీ మంత్రివర్యులు బైరెడ్డి శేషశయనారెడ్డి పేరు పెట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అంతకుముందు సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తనకు ఈ అవకాశం కల్పించినందుకు రైతుల సంక్షేమం కోసం కృషి చేసి మంచి పేరు తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు కలిమునిసా, సర్పంచ్ మరియమ్మ, చంద్రమౌళి, పోచ జగదీశ్వర్ రెడ్డి, తులసి రెడ్డి, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ రమేష్ నాయుడు, వైస్ చైర్మన్, తువ్వ శివరామ కష్టారెడ్డి, 80- సహకార సొసైటీ చైర్మన్ వైవి రమణ, బన్నూరు సుధాకర్ ,సూది రెడ్డి రమేష్ రెడ్డి, బద్దల శ్రీకాంత్,జబ్బర్, ఓంకార్ రెడ్డి, మోయిన్ మన్సూర్, సర్పంచ్ జనార్ధన్ గౌడ్, కేశవరెడ్డి నాగార్జున రెడ్డి, ఆర్టీసీ బాబు, ఎంపీటీసీ లు చందమాల సురేష్, నాగేశ్వరరావు, సురేష్, కౌన్సిలర్స్ లాల్ మోహన్, అబ్దుల్ రావు ఫ్, వైసీపీ నాయకులు ఉస్మాన్ బేగ్, రమేష్, రవీంద్రారెడ్డి, కాటే పోగు సురేష్, దామగట్ల ఉపసర్పంచ్ యేసు రత్నం, తదితరు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కాటసాని పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పుట్టినరోజు వేడుకలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 56వ పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ కంబగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కాటసాని ఓబుల్ రెడ్డి కాటసాని తిరుపాల్ రెడ్డిలు ప్రారంభించి వృద్ధులకు అన్నదానం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేద ప్రజల కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహీద్ హుస్సేన్, కుమ్మరి సురేష్ బాబు, ఈసారి ఎల్లయ్య, అంబటి రవికుమార్ రెడ్డి, కటికవానికుంట మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ కంబగిరి ఎస్ మమ్మద్ బాష, రమణ, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి ,కాటసాని తిరుపాల్ రెడ్డి

గర్భిణులు, పిల్లల సంరక్షణలో ఆశాల పాత్ర కీలకం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గర్భవతులు, పిల్లల సంరక్షణలో ఆశాల పాత్ర కీలకమని శిక్షకులు ప్రతిభ అన్నారు. శుక్రవారం మహిళా ప్రాంగణంలో నూతనంగా నియమితులైన ఆశా కార్యకర్తల శిక్షణ శిబిరం రెండవ రోజు శిక్షకులు ప్రతిభ పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటా తిరుగుతూ గర్భవతులను గుర్తించి వారికి వైద్య సలహాలు సూచనలు ఇస్తూ ప్రసవం అయ్యేవరకు వ్యాక్సిన్లు, ఐరన్ ఫోలిక్ మాత్రలు ఇవ్వాలన్నారు.ప్రసవం అయిన తరువాత పిల్లలకు యేడాదిన్నర వయస్సు వచ్చే వరకు వ్యాధి నిరోధక టీకాలు ఇస్తూ తల్లి పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత రక్త పరీక్షలు, గర్భిణిలకు మొదటి నెల నుంచి వారికి కావలసిన సమయంలో అన్నీ రకాల మందు లు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి 'యప్పటికప్పుడు వివరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకొనేలా ప్రోత్స హించాలని ఆరోగ్య పరీక్షలపై గర్భిణిలకు, బాలింతలకు వివరించాలని, సాధారణ ప్రసవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామీణ స్థాయిలో రోగులకు వివిధ వ్యాధులు, మానసిక వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య భోదకురాలు స్వర్ణ గౌరి , ఆరోగ్య పర్యవేక్షకురాలు సరళ గంగా, డీసీఎం వీరన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శిక్షకురాలు ప్రతిభ

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- టిడిపి నాయకులకు టిఇ. దినేష్ గౌడ్ సూచన

ప్రజాశక్తి-డోన్

అభివృద్ధి సంక్షేమం రెండు, రెండు కళ్లలా భావించి మంత్రి బుగ్గన పని చేస్తున్నారని వాస్తవాలు తెలుసుకోకుండా టిడిపి నాయకులు ఏదంటే అది మాట్లాడవద్దని డోన్ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ , 13వ వార్డు కౌన్సిలర్ టిఇ.దినేష్‌గౌడ్ అన్నారు. తెలుగు దేశం నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఆయన శుక్రవారం స్పందించారు. మా బుగ్గన విధి విధానాలు మంచివై మీరందరూ బతికి బట్ట కడుతున్నారని, లేదంటే నో నాయిస్ ఓన్లీ మ్యూజిక్ అని అన్నారు. వలసల రామకృష్ణ ఊసరవెల్లి కంటే ఎక్కువ రంగులు మార్చుకుంటూ పార్టీలు మారుతారని, ఆయనకు నీతి నిజాయితీ ఉందా అని అన్నారు. చక్రపాణి స్థాయి తెలుసుకోవాలని మా నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్‌గురించి మాట్లాడే స్థాయి కాదన్నారు. కన్న తండ్రిని కొడవలితో నడి రోడ్డుపై నరికి చంపిన కిరాతకులు, మట్కా దొంగ, మొబైల్స్ అమ్ముకునే మీరందరూ టిడిపిలో లీడర్లయ్యారన్నారు. అలాంటి వారంతా స్థాయిని మరిచి మాట్లాడటం మంచిది కాదన్నారు. టిడిపి సెల్ఫీ ఛాలెంజ్‌లో చేసిన ఆరోపణలో రుజువులు చూపించి మాట్లాడాలన్నారు. తాను మూడు కోట్ల ఇల్లు కడుతున్నది వాస్తవం కానీ అందుకుగాను నాకు రూ.నాలుగు కోట్లు అప్పు ఉందని, మీరు ఏమైనా నా అప్పు తీరుస్తారా అని ప్రశ్నించారు. గత 15 ఏళ్లగా రియల్ ఎస్టేట్ , బిజినెస్ లు చేస్తున్నానని, ఇందులో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తన ఆడిటర్‌తో మాట్లాడి కనుక్కోండన్నారు. నాకు మీ లాగా కబ్జాలు చేసే బుద్ధి లేదన్నారు. సాయిబాబా గుడి నిర్మించి దాదాపుగా ఐదేళ్లు అవుతుందని, ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. గుడికి పక్కన ఉన్న స్థలం అమ్మి గుడి పూర్తి చేస్తామన్నారనిగుడికి సంబంధించిన దాదాపుగా 40 సెంట్లు స్థలం మీకు అనుకూలమైన వారికి సెంటు రూ.3 లక్షలు, రూ.4 లక్షలుకు అమ్మిన డబ్బంతా ఏమి చేశారని ప్రశ్నించారు. గుడి కట్టడం ఎందుకు పూర్తి చేయలేదని సుబ్బారెడ్డిని ప్రశ్నించారు. మీరు కట్టిన పాత టిడిపి ఆఫీస్ కూడా కబ్జా చేసి కట్టినదని, మీతమ్ముడు నాగిరెడ్డి హాస్టల్ గోడ ఆరడుగుల ఆక్రమించి ఆఫీస్ కట్టుకున్నారన్నారు. దానికి సమాధానం ఏమి చెప్తావన్నారు. మేము వ్యాపారాలు చేసుకుని వాళ్ళం ఇకమీదట ఏదైనా ఆరోపణలు చేసే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడండన్నారు. డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన చేసి అభివృద్ధి చూసి ఓర్చుకోలేక టిడిపి నాయకులు లేనిపోని అబండాలు వేస్తున్నారన్నారు. అందుకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే టిడిపికి ఓడించి బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర, గేట్‌రాజు, రవి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు కృషి : చైర్మన్


బిటి ప్యాచ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, అధికారులు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. డోన్ పట్టణంలోని 10 లక్షల రూపాయలతో చేస్తున్న బిటీ ప్యాచ్ రోడ్డు పనులను శుక్రవారం చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికె హరికిషన్, ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ డిఈ రసూల్, ఏఈలు సురేష్, హితేష్‌లు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు రోడ్ల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో అండర్పాస్ బ్రిడ్జినిర్మాణం చేపట్టడంపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పొలాలకు ఇతర పనులకు వెళ్లే ప్రజలు రైతులు, ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు, రైల్వే ట్రాక్ పై వెళ్లడానికి రైళ్ల ,గూడ్స్ లు వచ్చినప్పుడు గేట్లు పడడం, అంతేకాకుండా రైల్వే ట్రాక్ దాటేటప్పుడు ఇబ్బందులు పడడం జరుగుతోందని, అటువంటి ఇబ్బందులు జరగకుండా ఉండడానికి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు అందరికి సహకరించే విధంగా ఆయా సమీపంలోని రైతులు సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, ఉన్నం రాజశేఖర్, ఉన్నం బాలిరెడ్డి, పుల్లయ్య గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి